## క్లుప్తంగా

### కరాటే శిక్షణతో ఆత్మరక్షణ



వైరాలో కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై భాగ్యరాజ్

**వైరా:** కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వానికి ఉపయోగపడుతుందని ఎస్సై భాగ్యరాజ్ అన్నారు. వైరాలోని బాలికల ఉన్నత పాఠశాలలో భద్రాద్రి మార్షల్ ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాల బాలికలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చిన మాస్టర్ రఘును అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీనియర్ కరాటే మాస్టర్ టి.శేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం విజయవంతం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**బోనకల్:** మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 60సంవత్సరాలు వయస్సు పైబడిన వృద్ధులకు వైద్యులు హరినాథ్‌బాబు, నరసింహారావు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ రవీందర్‌రావు, సూర్యప్రకాశ్‌రావు, సాదినేని జనార్దన్‌రావు, శ్రీనివాసరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షుడిగా వీరభద్రరావు



బాధ్యతలు స్వీకరించిన వీరభద్రరావు

**తల్లాడ:** మండలంలోని గంగదేవిపాడు(నూతనకల్) సొసైటీ అధ్యక్షుడిగా మిట్టపల్లికి చెందిన తూము వీరభద్రరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగిన రాయల శేషగిరిరావు డీసీసీబీలో వాహన రుణం తీసుకొని చెల్లించకపోవడంతో అతనిని పదవినుంచి తొలగించారు. దీంతో డైరెక్టర్లు తూము వీరభద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు, పాసంగులపాటి లక్ష్మీనారాయణ, గణేశుల రవి, పోట్రు శ్రీను, మల్లీడు కోటేశ్వర్‌రావు, చల్లా ఆదినారాయణ, ఎముకపాటి అప్పారావు, తూము సురేష్, పొనుగుమాటి రమేష్‌బాబు, గుగులోత్ లక్ష్మీదేవి, కన్నెపోగు రుక్మిణీ, షేక్ బ్రహ్మం, సొసైటీ సీఈఓ రాకేష్ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

**సత్తుపల్లిటౌన్:** పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన తురకా దానియేలు శుక్రవారం మరణించాడు. శుక్రవారం సత్తుపల్లి వడ్డెర సంఘం ఆధ్వర్యాన రూ.8వేలు ఆర్థిక సాయం అందించారు.

### సమాజ సేవకు కృషి చేయాలి



అన్నదానం చేస్తున్న దృశ్యం

**మధిర:** ప్రతిఒక్కరూ సమాజ సేవకు కృషి చేయాలని వ్యాపారి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి అన్నారు. ఆయన మనవడు శ్రీయాన్ పుట్టిన రోజు సందర్భంగా మదర్ థెరిస్సా సేవాసదనంలో శుక్రవారం అన్నదానం ఏర్పాటుచేసి మాట్లాడారు. కేంద్రంలోని దివ్యాంగులకు ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజనం ఏర్పాటుచేసిన వీరయ్యచౌదరికి నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత కృతజ్ఞతలు తెలిపారు.

### అమరజీవి అతుల్‌కుమార్

**కొణిజర్ల:** కేంద్రం రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులను చైతన్యం చేయడానికి అనేక కార్యక్రమాలు రూపొందించిన అతుల్‌కుమార్ అంజన్ అమరజీవి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. శుక్రవారం కొణిజర్లలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అతుల్ స్ఫూర్తితో రైతుల పక్షాన పోరాటానికి సంఘం సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సోమయ్య, లక్ష్మీనారాయణ, రమేష్, వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పోల్ చిట్టీ.. ఓ గూగుల్ మ్యాప్ !

- ఇంటింటికీ ఓటరు గైడ్
- ఈ సారి ముందుగానే పంపిణీ



సత్తుపల్లిలో పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్న సెక్టార్ అధికారి, బీఎల్ఓలు (ఫైల్)

**సత్తుపల్లిటౌన్:** ఎన్నికల సంఘం పంపిణీ చేసిన ఓటర్ స్లిప్పు గూగుల్ మ్యాప్‌లా ఉపయోగపడుతుంది. ఓటు వేసేందుకు ఓటర్లు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం ఓటర్లకు సమగ్ర సమాచారంతో పోల్‌చిట్టీలను అందిస్తుంది. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల కోసం 17 రోజుల ముందుగానే పోల్ చిట్టీల పంపిణీ చేపట్టారు. సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ముమ్మరంగా పంపిణీ చేస్తున్నారు. చిట్టీలు ఏ రోజు ఎన్ని పంపిణీ చేశారో సాయంత్రం ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

**సమయం వృథా కాకుండా..**

ఎన్నికల రోజు ఓటరు పోలింగ్ బూత్‌కు వెళ్లినప్పుడు ఓటరు జాబితాలో క్రమసంఖ్య, పోలింగ్ కేంద్రం పేరు, వివరాలను పోలింగ్ అధికారులతో పాటు ఆయా పార్టీల ఏజెంట్లు సైతం మార్క్ చేసుకుంటారు. వారి పేర్లను ఓటరు జాబితాలో వెతకటంతో సమయం వృథా అయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఓటరుతో పాటు పోలింగ్ కేంద్రం వివరాలతో పోల్ చిట్టీలను ముద్రించి ఎన్నికల సంఘం అందిస్తుంది. దీనిని తీసుకొని పోలింగ్ కేంద్రానికి వెళ్లగానే అందులోని వివరాలతో పోలింగ్ అధికారులు, ఏజెంట్లు సులభంగా ఓటరు జాబితాలో మార్క్ చేసుకోవచ్చు.



రూట్ మ్యాప్‌తో పోల్ చిట్టీ

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| సత్తుపల్లి | 1,18,490 | 1,25,441 | 12 | 2,43,943 |
| మధిర | 1,07,111 | 1,15,039 | 10 | 2,22,160 |
| వైరా | 93,700 | 99,683 | 06 | 1,93,389 |

**పోల్ చిట్టీలో..**

పోల్ చిట్టీలో అసెంబ్లీ నియోజకవర్గం, సంఖ్య, ఓటరు పేరు, లింగము, ఓటరు గుర్తింపుకార్డు సంఖ్య, తండ్రి పేరు, పోలింగ్ లోకేషన్, పోలింగ్ కేంద్రం సంఖ్య, పోలింగ్ కేంద్రం భవనం వివరాలు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్ 1950, క్యూఆర్‌కోడ్, రూట్ మ్యాప్ తదితర వివరాలు ముద్రించిన చిట్టీలను పంపిణీ చేస్తున్నారు. అదే విధంగా సంబంధిత బీఎల్ఓ పేరు, మొబైల్ నంబర్, ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలు, పోలింగ్ రోజున పాటించాల్సిన నిబంధనలు ఈ చిట్టీలో పొందుపరిచారు.



క్యూఆర్‌కోడ్‌తో పోల్ చిట్టీ, ఓటరు గైడ్

**ఓటరు గైడ్..**

ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు గైడ్ పుస్తకం అందిస్తున్నారు. 15 పేజీల ఈ పుస్తకంలో కొత్త ఓటరుగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు ప్రక్రియ, ఎప్పుడు నమోదు చేసుకోవాలో వివరించారు. ఓటు వేసేందుకు ఎటువంటి గుర్తింపు కార్డు తీసుకుపోవచ్చు.. ఏవి తీసుకుపోకూడదో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వివిధ యాప్‌లు, పోస్టల్ బ్యాలెట్ సదుపాయం, ఓటు వేసే విధానం గుర్తించి క్షుణ్ణంగా వివరించారు. తప్పకుండా ఓటు వేస్తానంటూ ఓటరు ప్రతిజ్ఞను ఓటరు గైడ్ పుస్తకంలో పొందుపరిచారు.

# భారీ మెజార్టీతో గెలిపించండి

– సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, పక్కన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, దయానంద్

**పెనుబల్లి:** ప్రజాసేవ కోసం ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పిలుపునిచ్చారు. శుక్రవారం పెనుబల్లి మండల కేంద్రంలో రింగ్‌సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యేతో పాటుగా ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు. మాయమాటలతో మోసం చేసిన బీఆర్‌ఎస్‌ని ప్రజలు నమ్మరని.. ప్రజా సంక్షేమం కోసం పోటీ చేసిన తనను ఆదరించి గెలిపించాలని రఘురాంరెడ్డి కోరారు. అదే విధంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం నుంచి అధిక నిధులు రావాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ప్రజానికాన్ని తన కుటుంబ సభ్యులుగా ఏ విధంగా చూస్తున్నాడో అదే విధంగా ఎంపీ అభ్యర్థి కూడా జిల్లా ప్రజలను అక్కున చేర్చుకుని వెన్నంటి ఉంటారన్నారు. మట్టా దయానంద్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు కేవలం ఆ పార్టీ కార్యకర్తలకే అందాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాపాలనలో పార్టీలకు అతీతంగా ఉచిత విద్యుత్, ఉచిత బస్ ప్రయాణ రాయితీ, గ్యాస్ సబ్సిడీ, రుణమాఫీని సైతం రైతులందరికీ అందించినట్లు తెలిపారు. స్వార్థం కోసం పనిచేసిన గత ప్రభుత్వ నాయకులు పార్టీకి అక్కర్లేదని.. సామాన్య కార్యకర్తలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులే గెలిపించి తీరుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, గూడూరు మాధవరెడ్డి, రాజబోయిన కోటేశ్వరరావు, కరీముల్లా, సూరపరెడ్డి బాపిరెడ్డి, మాలోత్ రాధాకృష్ణ, పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, దొంతు మాధవరావు, టీడీపీ, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి మాధురి

**ఎర్రుపాలెం:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమని మాధురి అన్నారు. శుక్రవారం మండలంలోని మీనవోలు, తక్కెళ్లపాడు, సఖినవీడు, ఇనగాలి, రామన్నపాలెం గ్రామాల్లో మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డిలతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని మహిళలు మాధురికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటా రాంబాబు, బండారు నర్సింహారావు, గంటా తిరుపతమ్మ, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు, వేమిరెడ్డి త్రివేణి, శీలం శ్రీనివాసరెడ్డి, శీలం వెంకట్రామిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, బుర్రా వెంకటనారాయణ, కూరపాటి యశోద తదితరులు ఉన్నారు.

# జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు



న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

**మధిర:** మధిర బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి గుంతా గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి, తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మధిర కోర్టు బిల్డింగ్ కమిటీ చైర్మన్ కట్టా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. మధిర కోర్టు భవన నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టేవిధంగా కృషి చేయాలని, ఇప్పటికే మంజూరైన సబార్డినేట్ కోర్టు ప్రారంభం కాకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జడ్జి స్పందించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు.

### మధిర నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వేమిరెడ్డి



వేమిరెడ్డి

**మధిర:** లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కోఆర్డినేటర్లను నియమించింది. ఈమేరకు మధిర నియోజకవర్గానికి మార్కెట్ మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డిని నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. అలాగే, సీపీఎం, సీపీఐ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, జితేందర్‌రెడ్డిని కూడా నియమించినట్లు వెల్లడించారు. వీరు ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయానికి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ సహకరించాలని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### 'నామ'ను గెలిపించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

**సత్తుపల్లిరూరల్:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావును గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం శుక్రవారం రాత్రి మండలంలోని కాకర్లపల్లిలో నాయకులు, ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామ గెలుపు కోసం బూత్‌లలో నాయకులు ప్రచారం నిర్వహించి నమూనా బ్యాలెట్లు ఓటర్లకు అందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగయ్య, వెంకటాచారి, రమేష్, సత్యనారాయణ, ప్రసాద్, నాగేశ్వరరావు, హరీష్, రామారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు



సత్తుపల్లి ఆర్టీసీ గేట్ వద్ద ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేస్తున్న మట్టా దయానంద్

**సత్తుపల్లిటౌన్:** ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఐఎన్‌టీయూసీ జెండాను జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రీజనల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, డిపో సెక్రటరీ సతీష్‌కుమార్, పసుపులేటి సుబ్బారావు, చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్‌పాషా, శర్మ, పి.వి.రావు పాల్గొన్నారు.

**సింగరేణిలో..**

సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో ఐఎన్‌టీయూసీ ఆవిర్భవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ రామారావు, కొత్తగూడెం బ్రాంచ్ సెక్రటరీ ఎ.భట్టి విక్రమార్క, భాస్కర్, ప్రకాష్, చెన్నకేశవ్, సమ్మయ్య, ఐవి రెడ్డి, సురేష్, సందీప్, కిరణ్, బాలకృష్ణ, లింగమూర్తి, తిరుమల, నాగేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

**కారేపల్లి:** మండలంలోని ఉసిరికాయలపల్లి, మాణిక్యారం ఎంపీటీసీ సభ్యురాళ్లు మూడ్ జ్యోతి, శివరాత్రి పార్వతి, మాజీ సొసైటీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు, మాణిక్యారం గ్రామ శాఖ అధ్యక్షుడు యడ్లపల్లి రాములు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సమక్షంలో గురు, శుక్రవారాల్లో చేరారు. వీరితో పాటు, కారేపల్లి గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్ అలీ కాంగ్రెస్‌లో చేరారు.

### కాకర్లపల్లి ఊరచెరువులో పూడిక తీత పనులు

**సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లి మండలం కాకర్లపల్లి ఊరచెరువులో సత్తుపల్లి శ్రీసర్వరాయషుగర్స్ బాటిలింగ్ యూనిట్ కిన్లే ప్లాంట్ యూనిట్ ఆధ్వర్యాన శుక్రవారం పూడిక తీత పనులు చేపట్టారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరగటం, భూగర్భజల రీఛార్జ్ మెరుగుపడుతుందని, పంట దిగుబడి సామర్థ్యం పెరుగుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు, కిన్లే ఫ్యాక్టరీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

### ఈ నెల 10 నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

**కారేపల్లి:** కారేపల్లిలో నిర్మించిన సాయిబాబా మందిర 25వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నాగసాయిశర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో వార్షికోత్సవ ఆహ్వాన కరపత్రాలను విడుదల చేశారు. 10న మంగళతోరణం, గణపతిపూజ, అఖండ దీపస్థాపన, 11వ తేదీన కాకడ హారతి, సీతారామాంజనేయ సహిత శ్రీ సమర్థ సద్గురు సాయినాథ స్వామికి అష్టోత్తర శత కలశార్చన, లక్షపుష్పార్చన, శ్రీసాయి చాలిసా, హనుమాన్ చాలిసా పారాయణం, 12న పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# ప్రచార రథాలతోనే సరి..

– గ్రామాల్లో కానరాని నాయకుల ప్రచారం

**కొణిజర్ల:** ఓటర్లను నేరుగా కలుసి ఓట్లు అభ్యర్థిస్తేనే ఓట్లు రాని నేటి పరిస్థితుల్లో మండలంలో అన్ని ప్రధాన పార్టీల నాయకులు ప్రచారానికి ముందుకు రావడం లేదు. ఓ వైపు ఎండ వేడి తీవ్రంగా ఉండటం.. మరో వైపు పార్లమెంట్ పరిధి పెద్దదిగా ఉండటంతో రాష్ట్ర నాయకులు పర్యటనలు బాగా తగ్గిపోయాయి. దీంతో మండల నాయకత్వం సైతం గ్రామాల్లో ప్రచారం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. రెండు నెలల క్రితమే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును ఎంపిక చేసినా.. ఇప్పటివరకు ప్రచారానికి రాలేదు. కేవలం కార్యకర్తల సమావేశాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఒకరోజు పర్యటించి మమ అనిపించారు. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాం రెడ్డి ఏప్రిల్ 30న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీనివాసరెడ్డితో కలిసి పర్యటించిన సంగతి తెలిసిందే. ప్రధాన పార్టీ అభ్యర్థులంతా కేవలం ప్రచార రథాలనే నమ్ముకున్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి ముందున్నారు. దీంతో మండలంలో ఎక్కడా ప్రచార జోష్ కనిపించడం లేదు. ఎన్నికలకు మరో 10 రోజులే గడువు ఉండటంతో వైరా నియోజకవర్గంలోనే అతి పెద్ద ఓటింగ్, విస్తీర్ణం కలిగిన కొణిజర్ల మండలంలో ఆయా పార్టీల నాయకులు ఎంత వరకు ప్రచారం చేస్తారో అంతు పట్టడం లేదు.

### బీజేపీ ఇంటింట ప్రచారం

ప్రచార పర్వం

**బోనకల్:** మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు విజయాన్ని కాంక్షిస్తూ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బోళ్ల బిక్షపతి, జ్వాలా నరసింహారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**అన్నారుగూడెం గ్రామంలో..**



తల్లాడ: అన్నారుగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**తల్లాడ:** మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి వినోద్‌రావును గెలిపించి మోదీని ప్రధానిని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లంకి సుధాకర్, మహిళలు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ నాయకులు..**

**ఎర్రుపాలెం:** బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆపార్టీ నాయకులు మండలంలోని భీమవరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. నామను మరోసారి గెలిపిస్తే జిల్లా సమగ్రాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు, జెడ్పీటీసీ శీలం కవిత అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, నాయకులు కామిశెట్టి పవన్‌కుమార్, ఎస్.కాశేశ్వరరావు, కత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**కుండ గుర్తుకు ఓటు వేయండి**



ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి జోగ్రాం నాయక్

**కారేపల్లి:** ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి తేజావత్ జోగ్రాం నాయక్ కుండ గుర్తుకు ఓటు వేసి.. బలహీన వర్గాలను బలపర్చాలని కోరుతూ.. శుక్రవారం కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వతంత్ర్య అభ్యర్థి మాట్లాడుతూ.. 8శాతం ఉన్న అగ్ర వర్ణాలు 92 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను అణగతొక్కుతున్నారని, రాజ్యాధికారం కోసం బలహీన వర్గాలు చైతన్య వంతులు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బస్కీనాయక్, బానోత్ సునీల్ నాయక్, సేనా నాయక్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

**ప్రచారాన్ని జయప్రదం చేయండి..**

**ముదిగొండ:** ఈ నెల 6న ముదిగొండలో నిర్వహించే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాఘురామరెడ్డి ప్రచారాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని న్యూలక్ష్మీపురం సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ రిసార్ట్స్‌లో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రచారానికి ప్రతీ గ్రామం నుంచి కనీసం 500 మంది కార్యకర్తలను, నాయకులను తరలించాలన్నారు. ఎన్నికల్లో రఘురామరెడ్డిని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మధిర నియోజకవర్గ బీ బ్లాక్ అధ్యక్షుడు కందిమళ్ల వీరబాబు, ఎంపీటీసీలు ఆదినారాయణరెడ్డి, బిక్షం, సరస్వతి, మాజీ జెడ్పీటీసీ దేవేంద్రం, నార్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే బ్యాలెట్ బాక్సులు !



మధిర: హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్



ఏన్కూరులో.. ఓటు వేస్తున్న వృద్ధురాలు



తల్లాడ: అన్నారుగూడెంలో..



చింతకాని: లచ్చగూడెంలో..

**మధిర/బోనకల్/చింతకాని/కారేపల్లి/ఏన్కూరు/తల్లాడ/కల్లూరు:** పార్లమెంట్ ఎన్నికల్లో వయో వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు శుక్రవారం నుంచి హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. మధిర పట్టణంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఖమ్మం ఆర్డీఓ గణేష్ పరిశీలించారు. బోనకల్ మండలంలోని 22 గ్రామాల్లో 94మంది వృద్ధులు ఉన్నారు. వీరందరూ తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ ఎల్.రాజు తదితరుల సమక్షంలో ఓటు హక్కు వనియోగించుకున్నారు. చింతకాని మండలంలో 39 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండలంలో మొత్తం 83 మంది ఉండగా తొలిరోజు 43 మందితో అధికారులు ఓటు వేయించాల్సి ఉంది. అందులో ఒకరు చనిపోగా.. మిగిలిన ముగ్గురు అందుబాటులో లేరని తెలిపారు. అదే విధంగా కారేపల్లి మండలంలోని హోమ్ ఓటింగ్ ప్రక్రియను సింగరేణి తహసీల్దార్ ఎస్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ జి.సురేందర్ ప్రారంభించారు. మండలంలో రెండు రూట్లలో పోలింగ్ నిర్వహించారు. రూట్-1లో సింగరేణి, సూర్యతండా, పోలంపల్లి గ్రామాల్లో, రూట్ 2లో విశ్వనాథపల్లి, వెంకిట్యాతండా, గిద్దెవారిగూడెం గ్రామాల్లో పోలింగ్ జరిపారు. ఏన్కూరు మండలంలో 26 మందిని వృద్ధులు, దివ్యాంగులను గుర్తించారు. శుక్రవారం మండలంలోని గార్లఒడ్డు, జన్నారం, నూకలంపాడు పంచాయతీల్లో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్ ఆధ్వర్యంలో ఇంటివద్దనే ఓటింగ్ నిర్వహించారు. తల్లాడలోని మల్లారం, బాలపేట, గోపాలపేట, అన్నారుగూడెం గ్రామాల్లోని వృద్ధులు, దివ్యాంగులు.. ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ వి.రవి పర్యవేక్షణలో ఓటు వేశారు. కల్లూరు మండలంలో తాళ్లూరు, తెలగవరం, పెద్దకోరుకొండి, వెంకటాపురం గ్రామాల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. కార్యక్రమంలో బృంధం తరఫున ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎన్నికల అధికారులు కోటేశ్వరరావు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 8 వరకు అర్హత కలిగిన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలల్లో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఓ ఎండి.తాజుద్దీన్, ఎంపీఓ కె.శ్రీదేవి, సెక్టార్ అధికారులు నర్సింహారావు, శ్రీనివాసరావు, ప్రవీణ్, ఎంపీడీఓ రామయ్య, ఎన్నెస్పీ డీఈ జక్కుల రామ్‌ప్రసాద్, పోలీస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.